క్లుప్తంగా

2న తోడు.. నీడ

డాబాగార్డెన్స్: పునర్వివాహం, వితంతు వివాహం కోరుకునే వారికి మార్చి 2న డాబాగార్డెన్స్ ప్రేమసమాజం ఆడిటోరియం వేదికగా తోడు.. నీడ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్, సీఏ ఏవీ రమణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆడారి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పునర్వివాహం, వితంతు వివాహం కోరుకునే వారికి ఉచితంగా ఈ అవకాశం కల్పించనున్నట్టు చెప్పారు. ఆ రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ పరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు ముందుగా తమ వివరాలు 72073 74717 నంబరుకు పంపాలని, లేదా డాబాగార్డెన్స్, కృష్ణాగార్డెన్స్‌లో గల సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

కేజీహెచ్ ప్రసూతి వార్డు సందర్శన

డాబాగార్డెన్స్: కేజీహెచ్‌లో ఇద్దరు శిశువుల తారుమారుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం ప్రసూతి వార్డును సందర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణ నివేదికను కమిషన్‌కు అందించాలని ఆదేశించారు. ఘటనపై విచారం వ్యక్తం చేశారు. వైద్యాధికారుల నిర్లక్ష్యం ఏదైనా ఉందా? నర్సింగ్ సిబ్బంది, ఆయాలు ఇతర సిబ్బంది ప్రత్యక్ష, పరోక్ష పాత్ర ఏమైనా ఉందా? అని ఆరా తీశారు. అధికారులు దర్యాప్తు జరిపి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

ఉక్కు ప్రైవేటీకరణ కుట్రలను తిప్పికొట్టాలి

సీతమ్మధార: విశాఖ ఉక్కు రక్షణకు జరుగుతున్న నిరాహార దీక్షల్లో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. సిటీ సెక్రటరీ ఎం.వి.త్రినాథ్ మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయడం కోసం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను కార్మికులు, ప్రజా సంఘాల ఐక్య వేదిక ప్రతిఘటిస్తున్నట్లు తెలిపారు. కేఎంకే కుమార్ మంగళం, జి.సూర్యచంద్రరావు, బి.వి.వి. రమణ పాల్గొన్నారు.

సైన్సే జీవరాశుల మనుగడకు మూలం



మహిళా డిగ్రీ కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రొఫెసర్ హర శ్రీరాములు, ఉపాధ్యాయులు



సీవీ రామన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

డాబాగార్డెన్స్: ప్రపంచంలో సమస్త జీవరాశుల మనుగడకు సైన్సే మూలమని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు తెలిపారు. ముందుగా కళాశాల ప్రాంగణంలో గల ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి, నోబెల్ పురస్కార గ్రహీత సర్ సీవీ రామన్ విగ్రహానికి నివాళులర్పించారు. రీసోర్స్ పర్సన్లు పి. కృష్ణకుమారి, సీహెచ్ మల్లిక, ఎం. శిరీష, కళాశాల డీన్ డాక్టర్ శంకరనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమెన్స్ కళాశాలలో..

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి, ఎస్. ఇందిరా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ హర శ్రీరాములు సైన్స్ పట్ల అవగాహన, ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ మోడళ్లను తిలకించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, రీసోర్స్ పర్సన్లు, విద్యార్థులను అభినందించారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో..

డాబాగార్డెన్స్‌లో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా ఎస్‌సీఐఎఫ్–సైఫై–2025 పేరిట సైన్స్‌డే నిర్వహించారు. ఎన్ఎస్‌టీఎల్ సైంటిస్ట్ ఆనంద్‌కుమార్ చంద్రయాన్–3 ప్రాముఖ్యత విద్యార్థులకు వివరించారు. జన విజ్ఞాన వేదిక ప్రతినిధి య కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పైడా కళాశాలలో

పైడా కళాశాలల్లో జాతీయ సైన్ దినోత్సవంలో ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సరోజ్ పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను తిలకించి, విద్యార్థులను అభినందించారు.

ఘనంగా సర్ సీవీ రామన్ జయంతి

అల్లిపురం: సర్ సీవీ రామన్ జయంతిని జీవీఎంసీ పాఠశాలలతో పాటు, డాబాగార్డెన్స్ రవీంద్రభారతి స్కూల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సైన్స్‌ఫేర్ విద్యార్థులను ఆకట్టుకుంది.

ఎంజీఎం హై స్కూల్‌లో..

ఎంజీఎం హైస్కూల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్‌ను విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తిలకించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మెయిన్‌రోడ్డులో గల జీవీఎంసీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయులు కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. డాబాగార్డెన్స్‌లో గల రవీంద్రభారతి స్కూల్లో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. డాక్టర్ సీతామహాలక్ష్మి, డాక్టర్ ఎస్.అప్పన్నబాబు, ఏయూ హెడ్ ఆఫ్ న్యూక్లియర్ సైన్స్ విభాగం ఆచార్యులు డాక్టర్ వెంకట లక్ష్మీనారాయణ, పాఠశాల నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్‌చార్జ్ ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.

పదవులు కోసం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం



వాసుపల్లికి దరఖాస్తు అందజేస్తున్న కాండ్రేగుల నాయుడు

డాబాగార్డెన్స్: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి యువత, అన్ని వర్గాల నుంచి పార్టీకి సేవలందించే వారిని గుర్తించి వారికి పదవులు అందజేసే విషయంలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. దీనిలో భాగంగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఆశీల్‌మెట్ట కార్యాలయంలో శుక్రవారం 31వ వార్డు నాయకుడు, పార్టీ ఆర్‌టీఐ యాక్ట్ నాయకుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో వార్డుకి చెందిన కాండ్రేగుల నాయుడు దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో రాజాపాత్రుడు, పిలక మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన సిబ్బందికి సత్కారం



పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: నలభై ఏళ్ల పోలీసు శాఖలో సేవలందించిన పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందనలు తెలిపారు. పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఫిబ్రవరిలో పదవీ విరమణ చేసిన సూపరింటెండెంట్ ఎ.శివ, ఏఆర్ ఎస్ఐ ఎం.చిలుకు, ఏఎస్ఐలు పి.ప్రసాద్, జి.వెంకటరమణ, ఎం.ఎం.నాయుడు, వి.కుమారస్వామి, ఏఆర్ హెచ్‌సీ బి.మొహంతిలను సత్కరించారు.

చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయి..

డాబాగార్డెన్స్: కేజీహెచ్ ఎథిక్స్ గ్యాలరీలో శుక్రవారం సీనియర్ వైద్యుడు, ఆర్‌ఎంవో డాక్టర్ ధవళ భాస్కరరావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని పరిపాలన విభాగం, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ డాక్టర్ ధవళ భాస్కరరావు అందించిన సేవలు ఎనలేనివన్నారు. డాక్టర్ భాస్కరరావు దంపతులను సూపరింటెండెంట్‌తో పాటు సీనియర్ వైద్యులు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ సూపరింటెండెంట్ తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, డాక్టర్ వాసవీలత, డాక్టర్ రాధాకృష్ణ, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్, ఏఆర్ఎంవో డాక్టర్ రాజేష్, చీఫ్ డైటీషియన్ రమణమూర్తి, కేజీహెచ్ ఏడీ సుమతి, విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌కుమార్, మేనేజర్ సత్యనారాయణ, ఎమ్మార్వో పీఎం జవహర్‌లాల్, అకౌంటెంట్ వెంకటలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్లు పద్మావతి, కల్పనామాళి, స్వర్ణలత, ఏపీ నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు టి. గంగాభవానీ, కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి పాల్గొన్నారు.

శేష జీవితం ఆనందంగా గడపండి..

జీవీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన 31 మంది అధికారులు, ఉద్యోగులను అదనపు కమిషనర్లు ఎస్ఎస్ వర్మ, డీవీ రమణమూర్తి సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ సునీల్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు సంపత్‌కుమార్, గోవిందరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు దిలీప్, శాంతిరాజు, తారా ప్రసన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీసీ సోమన్నారాయణ

జగదాంబ: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఆర్. సోమన్నారాయణ అన్నారు. శుక్రవారం జోన్–4 కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ అధికారులు, సిబ్బంది, సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది స్వచ్ఛభారత్‌లో ఉత్తమ ర్యాంక్ సాధనకు కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఇందుకు ముందుగా ప్రజలతో కలిసి ముందుకు వెళ్లాలన్నారు. జీవీఎంసీ ప్రజలకు అందజేస్తున్న సేవలకు సంబంధించి పది ప్రశ్నలు తయారు చేసుకుని ప్రజల నుంచి సమాధానాలు పొందాలన్నారు. అలాగే వీధులన్నీ పరిశుభ్రంగా ఉండే విధంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, అసిస్టెంట్ మెడికల్ అధికారి కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సంపూర్ణ భద్రత

సీతమ్మధార: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే భద్రత ఉంటుందని ఎన్ఐఎఫ్ఎస్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) జీపీఆర్ కృష్ణ అన్నారు. 54వ జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ (నిఫ్స్) విద్యార్థులు, సిబ్బందితో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఐ ఎఫ్ఎస్ సంస్థ భద్రతాపరమైన అవగాహన కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. వాహన చోదకులు క్షేమంగా ఇంటికి చేరుకోవాలని, మీ కోసం మీ కుటుంబం ఎదురు చూస్తుందంటూ ప్రదర్శించిన ప్లకార్డులు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, సిబ్బందితదితరులు పాల్గొన్నారు

గంజాయి కలిగిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు

విశాఖ లీగల్: గంజాయి కలిగిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ శుక్రవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో ఆరు నెలలు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.ఎస్.ఎన్.వి ప్రసాదరావు తెలిపిన వివరాలివి.. నిందితుడు బోలెం కన్నబాబు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్.వి.పి నగర్, కొబ్బరితోటలో నివాసం ఉంటున్నాడు. 2013 డిసెంబర్ 20న అప్పటి టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ వై.గోవిందరావు ఉదయం తనిఖీలు చేస్తున్న సమయంలో నిందితుడు కన్నబాబు నుంచి 13.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై సెక్షన్ 20బి, ఎన్‌డీపీఎస్ చట్టం కిందట కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఎట్టకేలకు పూర్వ డీఆర్ఎంకు బెయిల్

సాక్షి, విశాఖపట్నం: టెండర్లకు సంబంధించి కాంట్రాక్టర్ నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన వాల్తేరు రైల్వే పూర్వ డీఆర్ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్‌కు ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. గతేడాది నవంబర్‌లో ముంబయిలో ఓ కాంట్రాక్ట్ సంస్థకు చెందిన వ్యాపారుల నుంచి లంచం తీసుకుంటూ సౌరభ్ కుమార్ దొరికిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి సీబీఐ జైలులోనే సౌరభ్‌కుమార్ ఉన్నారు. హిందూస్థాన్ ఫైబర్ గ్లాస్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించి రూ.3.17 కోట్ల బిల్లు పెండింగ్‌లో ఉంది. అలాగే పనులు ఆలస్యంగా చేయడంతో రైల్వే బోర్డు భారీ జరిమానా విధించింది. ఈ నేపథ్యంలో బిల్లులు క్లియరెన్స్‌తో పాటు జరిమానా తగ్గించేందుకు సౌరభ్‌కుమార్ రూ.30 లక్షల లంచం అడిగినట్లు సీబీఐ విచారణలో వెల్లడైంది. చివరికి రూ.25 లక్షలు ఇచ్చేందుకు వ్యాపారులు అంగీకరించడంతో పుణెలో లంచం తీసుకుంటూ కేంద్ర దర్యాప్తు సంస్థకు రెడ్ హ్యాండెడ్‌గా సౌరభ్‌కుమార్ దొరికిపోయారు. పలుమార్లు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా సీబీఐ ప్రత్యేక కోర్టు (ముంబయి) తిరస్కరించింది. చివరికి సొంత పూచీకత్తుతో శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. నేరారోపణ నిరూపితమైతే సౌరభ్‌కుమార్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉన్నందున.. శిక్ష తీవ్రతను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు.

5వ తేదీలోగా బిల్లులు సమర్పించాలి

డాబాగార్డెన్స్: ఏపీఎస్ఆర్టీసీ విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా (పూర్వ రీజియన్) పారుగు సేవల కాంట్రాక్టర్లతో శుక్రవారం జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాంట్రాక్టర్ ప్రతి నెల 5వ తేదీలోపు తమ బిల్లులు డిపో/యూనిట్‌లో అందజేయాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రతి నెలా 10వ తేదీలోగా కనీస వేతనాలు చెల్లించాలని, అదే విధంగా పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. పర్సనల్ ఆఫీసర్ జె. తిరుపతి, అకౌంట్స్ ఆఫీసర్ వి. వంశీమోహని, అసిస్టెంట్ మేనేజర్ జి. శ్రీధర్, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సంధ్యాదేవి



డాబాగార్డెన్స్: ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ ఓబీజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెకు ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ గరుడ బుచ్చిరాజు ఉద్యోగ విరమణ చేయడంతో.. ఆయన స్థానంలో సంధ్యాదేవిని నియమించారు.

అనుమతులు లేకుండా ఔషధాల విక్రయం

- ఒకరికి ఆరు నెలల జైలు

విశాఖ లీగల్: అనుమతి లేకుండా మందుల దుకాణం నిర్వహించిన వ్యక్తికి ఆరు నెలల జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తూ నగరంలోని రెండవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సి.కె.గాయత్రి దేవి శుక్రవారం తీర్పు నిచ్చారు. ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కం జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు తెలిపిన వివరాలివి.. నగరంలోని నందగిరినగర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా మద్దాల సత్యనారాయణ ఔషధాలు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు 2013 జూన్ 14న ఔషధ తనిఖీ అధికారులు ఆర్.లలిత, కె.రజిత, ఎ.టి.వి.రమాదేవి ఈ దుకాణాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఎటువంటి లైసెన్స్‌లు లేకుండా కొన్ని మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతనిపై ఔషధ విక్రయ నిషేధ చట్టం సెక్షన్ 23(5)(బి) కింద కేసు నమోదు చేశారు. నిందితుడి నుంచి ఐదు రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

దేశాన్ని నాశనం చేస్తున్న ప్రధాని

సీతమ్మధార : భారత దేశాన్ని ప్రధాని మోదీ సర్వ నాశనం చేశారని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆశీల్ మెట్ట వద్దనున్న కేఏ పాల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ డీ లిమిటేషన్ పై రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఉత్తర భారతదేశంలో ఎంపీలను పెంచి, దక్షిణ భారత దేశంలో ఎంపీ స్థానాలు తగ్గిస్తున్నారని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలైన తమిళం, తెలుగు, కన్నడ భాషలు లేకుండా చేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం నగదు బదిలీ అనేది ఒక నాటకం అని, తల్లికి వందనం లేకుండా చేశారని ఆరోపించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 30 వేల మహిళలు తప్పి పోయారని గత ప్రభుత్వం హయాంలో ఆరోపించారని, అధికారంలోకి రాగానే వారిని వెనక్కి రప్పిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ ఎంతవరకు నెరవేర్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

'పది' పరీక్షల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగస్వాములయ్యే అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. జ్ఞానాపురంలో సిల్వర్ జూబ్లీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పరీక్షల విధులు కేటాయించిన అధికారులతో శుక్రవారం జరిగిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి నేలపై కూర్చుని పరీక్ష రాయకూడదన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లను తీసుకుని వెళ్లకూడదన్నారు. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా ప్రకటిస్తూ ఎక్కడికక్కడ నోటీసులు అతికించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, దగ్గరలోని జిరాక్స్ షాపులను మూసి వేయించాలన్నారు. పరీక్ష ప్రశ్నాపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరచడం, అక్కడ నుంచి కేంద్రాలకు తీసుకు వస్తున్నప్పుడు, తిరిగి పోస్టాఫీసుకు పంపించేటప్పుడు ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ప్రతిక్షణం అప్రమత్తతతో ఉంటూ పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రాంతీయ విద్యాసంచాలకుడు బి.విజయభాస్కర్, డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణ కుమార్, సీనియర్ ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గాయపరిచిన వ్యక్తికి రెండేళ్ల జైలు

విశాఖలీగల్: స్వల్ప వివాదంలో ఒక వ్యక్తిని తీవ్రంగా కత్తితో గాయపరిచిన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష శిక్ష విధిస్తూ నగరంలోని రెండవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సి.కె గాయత్రి దేవి తీర్పునిచ్చారు. ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కం జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలివి.. ఫిర్యాది నగరంలోని కైలాసపురం శాంతినగర్ ప్రాంతానికి చెందిన పూడి సత్యనారాయణ. ఆయన విశాఖ పోర్టు ట్రస్ట్‌లో పనిచేసే వాడు. నిందితుడు రౌతు సతీష్ కూడా అదే ప్రాంతంలో ఉంటున్నాడు. 2017 ఏప్రిల్ 25న సాయంత్రం నిందితుడు మద్యం సేవించి పూడి సత్యనారాయణ ఇంటికి వచ్చి గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. తదనంతరం రౌతు సతీష్ కత్తితో సత్యనారాయణపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పరారయ్యాడు. ఫిర్యాది వెంటనే తన కుటుంబ సభ్యుల సహాయంతో సమీపంలోని పోర్టు ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

త్వరలో పోలీసులకు సీటీ కరోనరీ యాంజియోగ్రామ్

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ పోలీస్ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం వార్షిక డీ–మోబిలైజేషన్ సెర్మోనియల్ పరేడ్ ఘనంగా జరిగింది. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ముఖ్య అతిథిగా పాల్గొని పరేడ్‌ను పరిశీలించారు. సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బందికి వార్షిక డీ–ఆర్మ్‌డ్ రిజర్వ్ శుభాకాంక్షలు తెలిపారు. 2019 తర్వాత ఈ ఏడాది మళ్లీ మోబిలైజేషన్ నిర్వహించినట్లు చెప్పారు. పోలీస్ నిబంధనల ప్రకారం ప్రతి జిల్లాలోనూ ఆర్మ్‌డ్ రిజర్వ్ జనవరి, ఫిబ్రవరిలో 12 నుంచి 13 రోజులు చేయాలన్నారు. ఈ నెల 14 నుంచి నిర్వహించిన శిక్షణ శుక్రవారంతో ముగిసిందన్నారు. ఫైరింగ్, ఫిజికల్, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చామన్నారు. ఆయుధాలతో విధులు నిర్వహిస్తున్నప్పుడు సిబ్బంది చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. సిబ్బందికి సీటీ కరోనరీ యాంజియోగ్రామ్ చేస్తామన్నారు.

పరిశ్రమల నిర్వహణకు నీటి వనరులు కేటాయించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: రానున్న వేసవిలో నీటి ఎద్దడి కారణంగా పరిశ్రమల నిర్వహణకు విఘాతం కలగకుండా నీటి వనరులు సమకూర్చేందుకు ఏర్పాట్లు చెయ్యాలని కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ అధికారుల్ని ఆదేశించారు. జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. విభిన్న సాంకేతిక అంశాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి అన్ని విధాలుగా సహకారం అందించాలని కలెక్టర్ సూచించారు. అజెండా అంశాలపై తీసుకున్న చర్యల గురించి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో పి. శ్రీలేఖ, ఐలా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఇతర విభాగాల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.